క్లుప్తంగా

మెప్మా ప్రాజెక్టు మేనేజర్‌గా శ్యామలాదేవి

మాచర్ల: మెప్మా ప్రాజెక్టు కార్యాలయ మేనేజర్‌గా పి.శ్యామలాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సనలతో ఆమె సమావేశమయ్యారు. డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి ఆర్పీ బాధ్యతతో పని చేయాలని సూచించారు. సమావేశంలో పట్టణంలోని 31 వార్డుల ఆర్పీలు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి ఓటమికి కూటమి కుట్ర



మాచర్ల: రాష్ట్రంలో అధికారంలో కూటమి నేతలు పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును ఓడించేందుకు కుట్ర చేశారని గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా నాయకుడు నూనావత్ రంగా నాయక్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడం దురదృష్టకర ఘటన అని పేర్కొన్నారు. బూత్‌లు ఆక్రమించి, రిగ్గింగ్‌కు పాల్పడే ప్రయత్నాలు చేయడం వారి దుశ్చర్యలకు నిదర్శనమన్నారు.

మాచర్ల ఆర్టీసీ డిపోకు రూ.7.18 లక్షల ఆదాయం



మాచర్ల: మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేకంగా ఆర్టీసీ 49 బస్సు సర్వీసులను శ్రీశైలం, సత్రశాల, మన్నేపల్లి తదితర శైవక్షేత్రాలకు ఏర్పాటు చేసింది. దీని వల్ల రూ.7.18 లక్షలు ఆదాయం వచ్చిందని ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. అదనపు చార్జీలు వసూలు చేయకుండా 96 శాతం ఆక్యుపెన్సీ దక్కిందన్నారు. గతేడాది రూ.5.99 లక్షలు వచ్చిందని, ఈసారి ఆదాయం పెరిగిందని వెల్లడించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విజయపురిసౌత్: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లకు పూర్తి చేసినట్లు స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరోజిని తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయన్నారు. కళాశాలకు చెందిన 173 మంది విద్యార్థులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల విద్యార్థులు 71 మంది, మొత్తం 244 మంది పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎగ్జామినేషన్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల ప్రిన్సిపల్ సరోజిని, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా మాచర్ల ఎస్కేబీఆర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ టి.నాగార్జునరెడ్డి వ్యవహరిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

చిన్నారుల భవితకు పునాది

- అంగన్‌వాడీలకు పోషణ్ భీ- పడాయి భీ శిక్షణ
- పౌష్టికాహారం, ఆటలతో కూడిన విద్యా బోధనకు ప్రాధాన్యం
- అంగన్‌వాడీ కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అవగాహన



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు(ఫైల్)

గురజాల: కేంద్ర ప్రభుత్వం బాలల పోషణ, విద్యను మరింత మెరుగు పర్చేందుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈ ఏడాది అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పడాయిభీపై ప్రత్యేక శిక్షణ అందించింది. పోషణ లోపం లేకుండా నాణ్యమైన ఆహారం, పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. క్షేత్ర స్థాయిలో ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలకు మూడు రోజులకు పైగా రీసోర్సుపర్సన్‌లు శిక్షణ అందించారు.

ఆటలతో కూడిన విద్యా బోధన

అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు కార్యకర్తలు ఆటలతో కూడిన విద్యా బోధన చేయాలని అవగాహన కల్పించారు. ఆధార్ షీలా, నవ చేతన కార్యక్రమం ద్వారా బాలల తొలి మూడేళ్ల అభివృద్ధి, తల్లిదండ్రులకు అవగాహన, మానసిక వికాసం వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు. బాల్య దశ నుంచే సరైన మార్గ దర్శకత్వం అందించాలనే లక్ష్యంతో ఆట ఆధారిత బోధన, పోషకాహార ప్రాముఖ్యత, కుటుంబ భాగస్వామ్యం వంటి అంశాలపై శిక్షణ కొనసాగుతోంది.

తొమ్మిది రోజుల పాటు శిక్షణ

అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పాటు పోషణ్ భీ- పడాయి భీ కార్యక్రమంపై, 6 రోజుల పాటు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఎలా విద్యనందించాలి, ఏ విధంగా చిన్నారులను పాఠశాలలకు వచ్చేలా చూడాలి, ప్రీ స్కూల్ విద్యను ఏ విధంగా బోధించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గురజాలలో 56, దాచేపల్లిలో 76, మాచవరంలో 74, పిడుగురాళ్లలో 105 అంగన్ వాడీ కేంద్రాలకు 0–3 సంవత్సరాల లోపు చిన్నారులు కేంద్రాలకు వస్తుంటారు. వీరికి పోషకాలతో కూడిన ఆహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం.

తొలి మూడేళ్లు ముఖ్యం



బిడ్డ పుట్టిన మూడేళ్లు చాలా ముఖ్యం. పిల్లల జీవితాలకు బలమైన పునాదిగా నిలుస్తాయి. కేంద్రాల్లోని ప్రీ స్కూలు విద్యను ఆట వస్తువులతో సమగ్రంగా అందిస్తే భవిష్యత్తు విద్యలో బాగా రాణిస్తారు. అందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.

– వై.రత్నకుమారి, ఇన్‌చార్జి సీడీపీవో.

రహదారి ఆక్రమణను విడిపించండి



వినతి పత్రం అందజేస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

దుర్గి: ఎన్నో ఏళ్లు ఇందిరమ్మ కాలనీ వాసులు వినియోగించుకుంటున్న రహదారిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి, నిర్మాణం చేపడుతున్నారని శుక్రవారం దుర్గిలో తమ నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలల క్రితం సాయి బృందావనం అపార్ట్‌మెంట్ పక్కన రహదారిని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ ఆందోళన చేశారు. రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవటంతో స్థానిక కాలనీ వాసులు మరో మారు తమ నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆక్రమణకు గురైన రహదారిని సర్వే చేయించి, రహదారి విముక్తి కల్పించాలని తహసీల్దార్ కార్యాలయ వీఆర్ఓ సునీతకి వినతి పత్రం అందజేశారు. రుద్రాల రవి, భీమా అంజయ్య, పులిబండ్ల నరసింహారావు, సూరె కృష్ణ, చెన్నకేశవులు, చిట్టిప్రోలు అమరేశ్వరరావు తదితర కాలనీవాసులున్నారు.

చిన్మమ్మ టీచర్ సేవలు ప్రశంసనీయం



టీచర్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టేఫీస్టార్

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చిన్నమ్మ టీచర్ చేసిన కృషి ప్రశంసనీయమని ఫాతిమా స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఫాతిమా స్కూల్‌లో ఉద్యోగ విరమణ చేస్తున్న చిన్నమ్మ టీచర్‌ను సన్మానించారు. సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. చిన్నమ్మ టీచర్ సేవలను ప్రభుత్వం గుర్తించి భారత మహిళ శిరోమణి అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఘనంగా సత్కరించిందన్నారు. చిన్నమ్మ టీచర్‌తో తమ పాఠశాలకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం చిన్నమ్మ టీచర్‌ను హెచ్‌ఎం స్టేఫీస్టార్ ఉపాధ్యాయులతో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి ట్రాఫిక్ చట్టాలు అమలు

క్రోసూరు: కొత్త వాహన చట్టం ప్రకారం శనివారం నుంచి ట్రాఫిక్ చట్టాలు అమలులోకి వస్తాయని ఎస్‌ఐ నాగేంద్రరరావు శుక్రవారం తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు, బీమా, హెల్మెట్ కలిగి ఉండాలని, అలా లేకుంటే అధిక జరిమానాలు వసూలు చేయబడతాయని చెప్పారు.

క్రీడాకారులకు టీ షర్టుల బహూకరణ



పిడుగురాళ్ల: గ్రామీణ ప్రాంత క్రీడాకాలను ప్రోత్సహించాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. స్థానిక స్కాలర్ డిగ్రీ కాలేజీ క్రీడా మైదానంలో కళాశాల క్రీడాకారులకు టీ షర్టులను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పిడుగురాళ్ల ప్రాంతంలో ఎంతోమంది క్రీడాకారులు ఉన్నారని, వారందరిని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆడించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కాలర్ విద్యా సంస్థల డైరెక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, మూలగొండ్ల జగదీష్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆవుల జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాచేపల్లిలోని పార్థు తల్లిపిల్లలు జనరల్ హస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రోగాలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు



విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

రెంటచింతల: ప్రతి విద్యార్థిని బాల్యం నుంచే లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో గురజాల ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పబ్లిక్ పరీక్షలు సిద్ధమవుతున్న విద్యార్థినుద్దేశించి మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థినులు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అర్థం చేసుకుని, ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. జిల్లా షెడ్యూల్ కులాల సాధికారిత అధికారి శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ఎన్నో ఆశలతో తమ పిల్లలను చదివిస్తున్నారన్నారు. వారి ఆశలు, కలలు నిజం కావాలంటే విద్యార్థులందరూ పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఆంజనేయులు విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, కిట్లను ఏఎస్‌డబ్ల్యూఓ గురజాల టీవీ సుజాతకుమారితో కలిసి పంపిణీ చేశారు. వార్డెన్‌లు జె.అరుణకుమారి, నూరెల్లా బేగ్, ఎస్.గోపాల్ నాయక్, మాధవీలత, శిరోమణి, రాణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



జ్ఞాపికలతో సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్స్

మాచర్ల : వ్యక్తి దర్జాగా ఉండటానికి దర్జీయే కారణమని రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో రోటరీ క్లబ్, పఠాన్ నాగుల్ మీరా, పఠాన్ నాగూర్ వలి ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ టైలరింగ్ రంగంలో వస్తున్న నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దర్జీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పఠాన్ బుడే సాహెబ్ స్మారక జ్ఞాపికలతో పాల్వాయి గ్రామానికి చెందిన కాకునూరి వెంకటేశ్వర్లు, న్యూ గోల్డెన్ టైలర్ వేల్పుల దానియేలు, గోపి టైలర్స్ చల్లా గోపిరెడ్డి, శిరిగిరిపాడు గ్రామానికి చెందిన కారంపూడి శివనాగిశెట్టి, లక్ష్మీ సాత్విక లేడీస్ టైలర్ బొట్ల సుజాత, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, రోటరీ గవర్నర్ కొండవీటి రామకోటయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్య ప్రసాద్, గోనుగుంట్ల రామ్మూర్తి, చెరుకూరి నరసింహారావు, ఇక్కుర్తి శంకర్, కోనేరు శంకర్, మారేపల్లి లక్ష్మీనారాయణ, శర్మ, కాశి పాల్గొన్నారు.

కారెంపూడిలో ఘనంగా టైలర్స్ డే

కారెంపూడి: స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలను మండలంలోని టైలర్స్ అందరూ జరుపుకున్నారు. చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కుట్టు మిషన్ కనిపెట్టిన విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అసోషియేషన్ మండలాధ్యక్షుడు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా, ఆషోషియేషన్ల కార్యవర్గ సభ్యులు షేక్ నజీర్, మాలపాటి వెంకటేశ్వర్లు, అక్బర్ వలి, మస్తాన్ వలి, బొంకూరి శంకర్ పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థుల ప్రదర్శనలను సందర్శిస్తున్న డాక్టర్ చిన్నమ్మ, స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి



సైన్స్ ప్రదర్శనలతో నారాయణ విద్యార్థులు



కొప్పునూరు పాఠశాలలో శాస్త్రవేత్త చిత్రాల ప్రదర్శన

రెంటచింతల: సీవీ రామన్‌ను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ ఎం.బాల చిన్నమ్మ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. జీవిత గమనంలో సైన్స్ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని విద్యార్థులకు వివరించారు. కాంతిపై చేసిన ప్రయోగాల ద్వారానే డాక్టర్ సీవీ రామన్ నోబెల్ బహుమతి పొందారన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దానిని వారు మెరుగుపరుచుకుంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించి, మంచి మార్గంలో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను ఆమె స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టేఫీస్టార్, ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఏరువ స్టేఫీ స్టార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ఎంపీడీఓ..

గురజాల: విద్యార్థుల ఆలోచన విధానాలతో మంచి ప్రతిభ కనబరచవచ్చని ఎంపీడీవో షేక్ గౌసియా బేగం అన్నారు. స్థానిక గుడ్ న్యూస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో శుక్రవారం నేషనల్ సైన్స్ డే నిర్వహించారు. సైన్స్ ప్రాజెక్టు వర్కులను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంపీడీఓ సందర్శించగా.. విద్యార్థులు ప్రాజెక్టుల గురించి ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సిస్టర్‌లు అరుల్ రోజ్, శిసిల్, జోస్మిన్ రోజా తదితరులున్నారు.

నారాయణ హైస్కూల్లో సైన్స్ డే

మాచర్ల: పట్టణంలో నారాయణ స్కూల్‌లో సైన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28న సి.వి.రామన్ తన రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశానికి ఎనలేని గుర్తింపు తెచ్చిందన్నారు. దీనికి గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని వెల్లడించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను క్షుణ్ణంగా పరిశీలించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి, కో–ఆర్డినేటర్ భద్రారెడ్డి, ఇన్‌చార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, సునీత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ కిరణ్‌రాజు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

మాచర్ల రూరల్: మండలంలోని కొప్పునూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ఐవీ నాగమణి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. శాస్త్రవేత్తల ఫొటోల ప్రదర్శన, క్విజ్ డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పోలు రాజు, అప్పారావు, మధుబాబు, పెద యేసోఫ్, నారాయణ, రామ్మోహన్‌రావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

టైలర్స్‌కి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

దాచేపల్లి : అర్హులైన నిరుపేద టైలర్స్‌కి ఇళ్ల స్థలాలు కేటాయించాలని టైలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు షేక్ సిలార్ కోరారు. టైలర్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాచేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విజయబాస్కర కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు సిలార్ మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన టైలర్స్‌కి పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, కౌన్సిలర్ షేక్ షరీఫ్, ఉపాధ్యక్షుడు కొబాల్ సుభానీ, రామకృష్ణా, కోశాధికారి మస్తాన్‌వలి, కార్యదర్శి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి..



శెట్టిపల్లి యలమంద

దుర్గి: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని జెడ్పిటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద ఆరోపించారు. శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో వారిని చేర్చకపోవడం అన్యాయమన్నారు. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనేక మార్లు కౌలు రైతులకు న్యాయం చేస్తామని చెప్పి, నేడు బడ్జెట్‌లో నిధులను కేటాయించకపోవడం వారిని మోసం చేసినట్లేనన్నారు. అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర ప్రభుత్వానికి రైతాంగం పట్ల మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి పథకాలను విస్మరించడం కూటమి ప్రభుత్వం దివాళా కోరుతనమన్నారు.

టామా‘రా’



మాచర్ల: టమాటా ధరలు పతనమయ్యాయి. రూ.8లకే విక్రయిస్తున్నారు. కొందరు రైతులే 5 కేజీలు రూ.40లకు అమ్ముతున్నారు. రైతులు పంటకు మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



పిడుగురాళ్ల: వ్యవసాయ కూలీల ప్రయాణం ప్రమాదపుటంచులో సాగుతోంది. ఆటో వాలాలు, ట్రాక్టర్ల ట్రక్కుల్లో కూలీలను రోజూ వారిని పనులకు తీసుకెళ్తున్నారు. కిక్కిరిసి కూలీలు ప్రయాణిస్తున్న ప్రమాదాలకు గురవుతున్న ఘటనలూ చూస్తూనే ఉన్నాం. శుక్రవారం ట్రక్కు డోర్‌లను తీసేసి, ఇలా కాలువ అంచున ప్రమాదకరంగా ట్రాక్టర్ వెళ్తోంది. ఏమాత్రం ట్రక్కు అటో..ఇటో అయినా.. మూల్యం చెల్లించిక తప్పదు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

క్రోసూరు: వేసవి కాలం పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ రవి కోరారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డే సందర్భంగా సాధారణ తనిఖీల్లో భాగంగా క్రోసూరు పీహెచ్‌సీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు.

నేడు శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల నిర్వహణపై సమీక్ష

దుర్గి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా శనివారం సంబంధిత శాఖాధికారుల సమీక్షా సమావేశానికి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11గంటలకు దేవస్థాన ప్రాంగణంలో సమావేశం ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై తిరునాళ్ల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

• నేడు పింఛన్ల పంపిణీ

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో శనివారం ఉదయం 7 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,363 మందికి రూ. 2,79,62,000 అందజేస్తామన్నారు. 11 రేషన్ బండ్ల ద్వారా నిత్యావసరాలు కూడా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు.